సాక్షి సిద్దిపేట

ఆదివారం । 21 । మే । 2023



కోలుకునే.. ఇప్పుడిప్పుడే

నాలుగు నెలలుగా నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ధర పెరిగినా..ఎంత కాలం కొనసాగుతుందో తెలియని పరిస్థితి. 8లో..



రెండుచోట్ల హార్వెస్టర్లు దగ్ధం

వరి కోత సమయంలో విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధమైంది. మనోహరాబాద్ మండల కేంద్రం, కొండపాక మండలంలో శనివారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. 8లో..



ఉత్సవాలకు సర్వం సిద్ధం

దుబ్బాక పట్టణంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో నేటి నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు నిర్వాహకుల అన్ని ఏర్పాట్లు చేశారు. 9లో..

న్యూస్‌రీల్

25న మల్లన్న హుండీ లెక్కింపు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి హుండీలను ఈ నెల 25న లెక్కిస్తామని ఆలయ ఈఓ బాలాజీ తెలిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మొక్కుబడి టికెట్ బుక్స్, ఇతర బుక్స్ ప్రింటింగ్, సరఫరా చేసేందుకు ఈ నెల 29న సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు దరవాత్తుగా రూ.10 వేలు కార్యనిర్వహణాధికారి శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానం పేరిట డీడీతీసి తేది 29వ తేదీలోగా టెండర్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



విత్తన కంపెనీలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం సెంట్రల్ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాంరెడ్డి, కమిషనరేట్ అదనపు సంచాలకులు పద్మజ, ఏడీఏ పృథ్వీ రాజ్, రాంమోహన్‌తో కూడిన బృందం మండలంలోని కొత్తూరు శ్రీసత్య ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, బండమైలారం సీడ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రికార్డులను, విత్తన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ప్రగతి, వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్విరాజ్ పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

సిద్దిపేటఅర్బన్: ఉపాధి పనులను విస్తరింపజేయాలనే డిమాండ్‌తో ఈనెల 25న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్, రాజ్యసభ సభ్యుడు శివదాసన్, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు, రిటైర్డ్ ఐపీఎస్‌లు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రవీంద్రచారి, సభ్యులు కనకయ్య, మల్లేశం, వెంకటచారి, వెంకట్, కనకవ్వ, రవీందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న బీసీ విద్యార్థులు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో ఉండేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి మురళి శనివారం తెలిపారు. ప్రీమెట్రిక్‌లో 636 బాలురు, 238 బాలికలు, పోస్ట్‌మెట్రిక్‌లో 275 బాలురు, 283బాలికలు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విశ్వహిందూ పరిషత్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్వహిందూ పరిషత్ సిద్దిపేట పట్టణ నూతన కార్యవర్గాన్ని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నియమించారు. శనివారం సిద్దిపేటలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు హాజరయ్యారు. ఈ సమావేశంలో రానున్న 6 నెలల్లో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సిద్దిపేట నగర విశ్వహిందూ పరిషత్ కార్యదర్శిగా బోనాల శ్రీనివాస్, సిద్దిపేట నగర విశ్వహిందూ పరిషత్ న్యాయ సలహాదారునిడిగా గడీల చంద్రారెడ్డిలను నియమిస్తూ నియామకపత్రాలను అందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి గ్యాదరి రాజారాం, విశ్వహిందూ పరిషత్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి నరేశ్, బజరంగ్‌దళ్ సిద్దిపేట సంయోజక్ శ్రీనివాస్, బజరంగ్‌దళ్ సిద్దిపేట జిల్లా సహ సంయోజక్ బైరి మురళి, కార్యాలయ ప్రముఖ్ దినేశ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలిటికల్ హీట్

హుస్నాబాద్‌లో ఎన్నికల వేడి

- బీఆర్ఎస్, సీపీఐ అభ్యర్థుల ప్రకటన
- పొత్తులపై రాని స్పష్టత
- త్వరలో బీజేపీ బస్సు యాత్ర



సాక్షి, సిద్దిపేట: సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందే హుస్నాబాద్ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. పది రోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు బహిరంగ సభలు ఏర్పాటు చేసి హుస్నాబాద్ నుంచి పోటీ చేసే అభ్యర్థులను సైతం ప్రకటించారు. మరోవైపు బీజేపీ నాయకులు బస్సు యాత్ర పేరిట హుస్నాబాద్‌లో పర్యటించి పట్టు పెంచుకునేందుకు సమాయత్తమవుతున్నారు. దీంతో హుస్నాబాద్ రాజకీయాలు ఒక్కసారిగా రసవత్తరంగా మారాయి.

అభ్యర్థుల ప్రకటన

ఈ నెల 5వ తేదీన హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో హుస్నాబాద్‌లో సతీశ్ కుమార్‌కు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మరోవైపు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ ప్రజల మధ్య ఉంటున్నారు. సీపీఐ బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 15న హుస్నాబాద్‌లో బహిరంగ సభను నిర్వహించారు. హుస్నాబాద్ నుంచి సీపీఐ అభ్యర్థిగా చాడ వెంకట్ రెడ్డి పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ప్రజా సమస్యలపై చాడ వెంకట్ రెడ్డి పోరాటాలు చేస్తూ నిత్యం ప్రజల్లో తిరుగుతున్నారు.

ఎవరితో పొత్తు?

వచ్చే ఎన్నికల్లో సీపీఐకి ఎవరితో పొత్తు ఉంటుందని జోరుగా చర్చ సాగుతోంది. మునుగోడు ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌కు సీపీఐ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. దీంతో మొదట బీఆర్ఎస్, సీపీఐ పొత్తు ఉంటుందని ప్రజలు అనుకున్నారు. కానీ ఆయా పార్టీలు వేర్వేరుగా అభ్యర్థులను ప్రకటించడంతో పొత్తుపై సందిగ్ధం నెలకొంది. సీపీఐ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటుందా.. లేక ఒంటరిగా బరిలో నిలుస్తుందా అనేది తెలియాల్సి ఉంది.

పర్యటన ఏర్పాట్లలో బీజేపీ

గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజవర్గాల్లో జరిగిన అభివృద్ధి హుస్నాబాద్ నియోజవర్గంలో జరగ లేదని ఇటీవల బీజేపీ నాయకుడు బొమ్మా శ్రీరాం చక్రవర్తి ఆరోపించారు. నియోజవర్గాల్లో జరిగిన అభివృద్ధిని పరిశీలించేందుకు అధికార ప్రతిపక్ష నాయకులందరిని ఆహ్వానిస్తున్నానని ఇదివరకే ప్రకటించారు. బస్సు యాత్రతో నియోజకవర్గాలను పరిశీలనకు శ్రీకారం చుట్టేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



తిమ్మాయిపల్లిలో కమ్యూనిటీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్రా అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. తిమ్మాయిపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ ఫంక్షన్‌హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మాయిపల్లి గ్రామం మీదుగా రింగు రోడ్డు, ఐదు గ్రామాలను కలుపుతూ వేసిన తారు రోడ్డుతో రూపు రేఖలు మారాయన్నారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త నిర్వహణలో తిమ్మాయిపల్లి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఇష్టారీతిగా రసాయన ఎరువులు వాడడంతో భూసారం దెబ్బతింటుందని, పంటసాగుకు ముందుకు జనుము, జీలుగ సాగు చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం నర్మేట రోడ్డు పునరుద్ధరణ, మహిళా సామాఖ్య, యూత్ బిల్డింగ్ పనులను మంత్రి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని బొడ్రాయి, ఎల్లమ్మ, పెద్దమ్మ, హన్‌మాన్, బీరప్ప ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లత, ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, మల్లయ్య, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, నర్సింలు యాదవ్, రాజు, స్వామి, నర్సింలు, నారాయణ, రాజయ్య, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి, బాల్‌లింగం, రవి, పద్మ, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ లేఅవుట్ సిద్దిపేటలోనే



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

- గ్రేటర్ తర్వాత ఇక్కడే అమలు
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటజోన్: హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలో తొలి లే అవుట్ సిద్దిపేటలో అమలు చేస్తున్నామని, పట్టణాభివృద్ధి సంస్థలో ప్రథమ ప్రక్రియ ఇక్కడ సాగడం సంతోషంగా ఉందని కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అన్నారు. శనివారం విపంచి ఆడిటోరియంలో సుడా ఆధ్వర్యంలో చేపట్టిన మిట్టపల్లి లేఅవుట్ బహిరంగ వేలం ప్రక్రియ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో సుడా ఆధ్వర్యంలో పొన్నాల, కరీంనగర్, మెదక్ రహదారుల పక్కన లేఅవుట్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధికారికంగా లేఅవుట్‌తో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉండవని, అన్ని రకాల వసతులు ఉంటాయని, అనుమానాల నివృత్తి కోసమే సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్లాట్లు కొన్నవారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుందన్నారు. మరింత అవగాహన కోసం ఈనెల 24 న రెండోసారి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 29న జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ రమణ చారి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, కౌన్సిలర్లు వజీర్, మోహిజ్, జెడ్పీటీసీ శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు.

రోజుకో గంట యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ రఘురాం



యోగా శిక్షణకు హాజరైన జడ్జి రఘురాం

సిద్దిపేటజోన్: రోజుకో గంట యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రతీరోజు గంట సమయం కేటాయించాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ రఘురాం అన్నారు. యోగా మహోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. పని ఒత్తిడితో ఉద్యోగులు, మహిళలు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ధ్యానం, యోగా, ప్రాణాయామం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు స్వరూప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మమత రఘువీర్, సీపీ శ్వేత తదితరులు

రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ టెక్నికల్ డైరెక్టర్ మమత రఘువీర్



హాజరైన పోలీస్, వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మహిళలకు, పిల్లలకు రక్షణ కల్పిస్తున్నామని రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ టెక్నికల్ డైరెక్టర్ మమత రఘువీర్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో సీపీ ఎన్.శ్వేత, ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా లైంగిక వేధింపుల కేసులపై మెడికో లీగల్ ఇన్వెస్టిగేషన్‌పై పోలీసు అధికారులు, వైద్యులకు అవగాహన కల్పించారు. సమాజానికి పోలీసులు, డాక్టర్లు చాలా ముఖ్యమని ప్రజలకు సేవ చేయడానికి ముందు వరుసలో ఉండాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. బాధితులతో ఫ్రెండ్లీగా మాట్లాడి స్టేట్‌మెంట్ రికార్డు చేయాన్నారు. ఉమెన్ సేఫ్టీవింగ్ అడిషనల్ ఎస్పీ అశోక్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ కీలకపాత్ర వహిస్తుందని, 161 పబ్లిక్, 164 స్టేట్‌మెంట్స్ మెడికల్ ఎగ్జామినేషన్, రోల్ ఆఫ్ మెడికల్ కేస్ స్టడీ, కంపెన్‌సేషన్, క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఉమెన్ సేఫ్టీవింగ్ ఫోరెన్సిక్ మెడికల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ సుధ మాట్లాడుతూ మెడికో లీగల్ కేసుల్లో చట్టపరమైన అంశాల్లో బాధితులో నడుచుకోవాల్సిన పద్ధతులపై వివరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కేసుల పరిశోధనలో, మెడికల్ ట్రీట్‌మెంట్‌లో జరిగే పొరపాట్లు, కోర్టులో నేరస్తులకు లైంగిక వేధింపుల కేసుల్లో పడే శిక్షలపై వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏసీపీలు దేవారెడ్డి, రమేష్, సతీష్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సీసీఆర్బీ ఏసీపీ చంద్రశేఖర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ చందర్, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ రామ్మోహన్, జూనియర్ వైద్యులు, పీజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ఉపాధిహామీని కాలరాస్తున్న కేంద్రం

దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆరోపించారు. శనివారం మండలంలోని తిగుల్‌లో ఉపాధిహామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రోజుకో విధానం తీసుకువస్తూ పని హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. ప్రతీ ఏడాది బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ పథకాన్ని నీరుగారుస్తుందన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ విధానంతో రోజుకు రెండు సార్లు కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేయాలనడం చట్ట వ్యతిరేకమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న ఉపాధి హామీ పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు దాసరి ఏగొండస్వామి, వేణు, కూలీలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్తీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు

సిద్దిపేట డివిజన్ వ్యవసాయ సంచాలకురాలు పద్మ



విత్తనాలను పరిశీలిస్తున్న డివిజన్ వ్యవసాయ సంచాలకురాలు పద్మ

సిద్దిపేటఅర్బన్: రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని సిద్దిపేట డివిజన్ వ్యవసాయ సంచాలకులు వై.పద్మ, మండల వ్యవసాయ అధికారి పరశురాంరెడ్డి హెచ్చరించారు. శనివారం అర్బన్ మండలంలోని విత్తన కంపెనీలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల విక్రయాల్లో నిబంధనలు పాటించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. రైతులు విత్తనాలు కొనేసమయంలో విధిగా రసీదు పొందాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



మాట్లాడుతున్న డీఏఓ శివప్రసాద్

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. వానాకాలం సీజన్ కాలం ప్రారంభం అవుతున్నందున రైతులకు దుకాణాదారులు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను విక్రయించాలన్నారు. ఏఓ వసంతరావు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ డీలర్లను ఆదేశించారు. శనివారం నంగునూరు మండల విత్తన డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన చట్టం 1963 ప్రకారం కల్తీ విత్తనాలు అమ్మినా, నియమ నిబంధనలు పాటించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ గీత, ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

తరుగుపై అన్నదాతల ఆగ్రహం

- నాలుగు కిలోల కోతపై మండిపాటు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు మొరపెట్టుకున్న రైతులు



వ్యవసాయ మార్కెట్ యార్డులో కాంటా పూర్తయిన ధాన్యం బస్తాలు

హుస్నాబాద్: ధాన్యం అమ్మకాల్లో మిల్లర్ల మాయాజాలనికి రైతులు బలవుతున్నారు. మ్యాచర్ రావడం లేదంటూ, నూకలు వస్తున్నాయంటూ తరుగు తీస్తుండడంతో ఆగ్రహించిన అన్నదాతలు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తరుగు పేరిట మోసం చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెండు గంటల పాటు నిరసన తెలిపారు. మార్కెట్ యార్డులో 20 రోజులుగా ధాన్యం ఉన్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కాంటా పూర్తయిన 5వేల క్వింటాళ్ల ధాన్యం బస్తాలు ఎండలోనే ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చర్చలు విఫలం..

రైతులు తెచ్చిన ధాన్యం కాంటా పెట్టిన తర్వాత వెంటనే అధికారులు మిల్లులకు తరలించాల్సి ఉంది. కాంటా పూర్తయి మిల్లర్లకు ధాన్యం వెళ్లాక కోత విధిస్తున్నామంటూ ఫోన్ చేసి చెబుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టం ఉంటే అమ్మండి లేదంటే తీసుకువెళ్లండని షరతులు విధిస్తున్నారని వాపోతున్నారు. ఇష్టారీతిన తరుగు తీస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలంటూ రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. పది రోజులుగా సమస్య చెబుతున్నా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహించారు. తహసీల్దార్ ఉన్నిసా బేగం కలిగించుకొని.. మిల్లర్లతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పినా రైతులు వినలేదు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉందని, రైతులు ఇచ్చిన ధాన్యంలో క్వింటాల్‌కు 52కిలోల బియ్యం మాత్రమే వస్తుందన్నారు. అనుకున్న స్థాయిలో బియ్యం రాకపోవడంతో తరుగు తీస్తున్నామని, లేదంటే తాము నష్టపోవాల్సి వస్తుందని మిల్లర్లు పేర్కొన్నారు. రైతులు, మిల్లలతో చర్చలు నిర్వహించేందుకు తహసీల్దార్ ప్రయత్నించగా, తమను కింద కూర్చొబెట్టి అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు చర్చలను బహిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు సమస్య వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

20 రోజులుగా కొనలేదు



ధాన్యం కాంటా పెట్టి 20రోజులు అవుతుంది. లారీలు రావడం లేదనే సాకుతో బస్తాలను కేంద్రంలోనే ఉంచారు. దీంతో రోజు కేంద్రం వద్దకు వచ్చి కాపలా ఉంటున్నాం. ఆరబెట్టిన ధాన్యాన్ని అమ్మితే మిల్లర్లు 4కిలోల తరుగు తీస్తున్నారు.

– సంగీత, మహిళా రైతు హుస్నాబాద్

అధికారులదే బాధ్యత



ధాన్యం కాంటా పూర్తయ్యాక అధికారులదే పూర్తి బాధ్యత. మిల్లర్లకు పంపించిన తర్వాత ఫోన్ చేసి తరుగుతీస్తున్నామంటూ ఫోన్ చేసి చెబుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలి. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.

– అయిలేని చిన్నరాజిరెడ్డి, రైతు, హుస్నాబాద్

క్లుప్తంగా

ఎర్తింగ్ వైరుకు తగిలి..


మృతిచెందిన ఎద్దు వద్ద రైతు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని మొండి తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మోగ్యానాయక్ ఎద్దు రోజులాగే మేత మేయడానికి వెళ్లి ఎర్తింగ్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

బాలుడి మృతిపై పోలీసుల విచారణ

మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాలలో తోపులాటలో బాలుడి మృతిచెందిన ఘటనపై శనివారం పోలీసులు విచారణ ప్రారంభించారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణమూర్తి గ్రామానికి చేరుకుని బాలుడి మృతిపై విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యబృందం ఆధ్వర్యంలో బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం మండల పరిధిలోని గుంజోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ శనివారం ఇంట్లో విద్యుత్ మోటారు ప్లగ్ పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగిలింది. స్పృహ కోల్పోయిన విజయ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం సమీపంలో గల బీదర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు విజయ్‌కుమార్ మృతి చెందినట్టు తెలిపారు.

కోలుకునే.. ఇప్పుడిప్పుడే

- ధర పెరగడంతో పౌల్ట్రీ రైతులకు ఊరట
- లైవ్ బర్డ్ కిలో రూ.105

గజ్వేల్: నాలుగు నెలలుగా నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ప్రస్తుతం పెరిగిన ధర ఎంత కాలం కొనసాగుతుందో చూడాలి. ఉమ్మడి మెదక్ జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్దదిగా పౌల్ట్రీ వెలుగొందుతోంది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఉత్పత్తులను అందిస్తున్న జిల్లాగా ఈ ప్రాంతం ఖ్యాతి గడించింది. పౌల్ట్రీపై ప్రతి నెలా ఇక్కడ రూ.1000 కోట్ల మేర లావాదేవీలు సాగుతుంటాయని అంచనా.

- వేలాది మంది రైతులు సుగుణ, వెంకటేశ్వర, డైమండ్, జాప్నవి, జానకి, ఎస్ఆర్, స్నేహ తదితర ఇంటిగ్రేటెడ్ సంస్థల భాగస్వామ్యంతో పౌల్ట్రీలు నడుపుతున్నారు.
- ఆ సంస్థల నుంచి చిక్స్, వాటికి 45రోజుల వ్యవధి కోసం మందులు, దాణా అందుతుంది. ఒక్కో బర్డ్ సగటున రెండు కిలోలకు పైగా తూకం వస్తుంది. ఈ స్థాయికి వచ్చేవరకు సంస్థలు రెండు కిలోల కోడిపై రూ. 180కిపైగా ఉత్పత్తి వ్యయం కింద ఖర్చుచేస్తున్నాయి.
- మార్కెట్‌లో చికెన్ ధరతో సంబంధం లేకుండా రైతులకు ఒక్కో కోడిపై కిలోకు రూ. 5–6 చెల్లిస్తాయి. నిర్వహణ బాగుంటే మరో 50పైసలు అదనంగా చెల్లిస్తారు.
- ఇంటిగ్రేటెడ్ సంస్థల ఒప్పందం ప్రకారం ఉత్పాదక వ్యయం భారీగా పెరిగితే మాత్రం రైతులు నష్టాలు భరించాల్సి ఉంటుంది.
- 5శాతం కోళ్లకంటే ఎక్కువగా మృత్యువాత పడితే నష్టాలను రైతులే భరించాలి. విద్యుత్‌చార్జీల రూపేణా 5వేల కోడిపిల్లల సామర్థ్యం కలిగిన షెడ్‌కు 45రోజులకు రూ.5వేలపైనే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.
- వీటన్నింటినీ మినహాయిస్తే ఈ సంస్థల భాగస్వామ్యంతో కోళ్లను పెంచుతున్న రైతులకు మిగులుతున్నది అంతంతమాత్రమే.


గజ్వేల్‌లోని ఓ పౌల్ట్రీ ఫామ్

కొన్నేళ్లుగా ప్రతికూల పరిస్థితులు

- కొన్నేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమను ప్రతికూల పరిస్థితులు చుట్టుముడుతున్నాయి. సొంత పరిశ్రమలో ఒక్కో కోడి ఉత్పత్తి చేయడానికి అన్నీ కలుపుకొని రూ.180కిపైగా వరకు ఖర్చవుతున్నది.
- రెండు కిలోలపైగా బరువుండే లైవ్ బర్డ్స్ చికెన్ ధర రూ. 210కి పైగా పలికితే నష్టాలు ఉండవు. కానీ ధరలో నిలకడ లేక పౌల్ట్రీ రైతులు ఆందోళనలో ఉన్నారు.
- నాలుగు నెలలుగా లైవ్ బర్డ్ ధర కిలోకు కేవలం రూ.55–85 మాత్రమే పలికింది. పది రోజులుగా ప్రస్తుతం కంపెనీలు రైతుల వద్ద లైవ్ బర్డ్‌ను కిలోకు రూ.105కిపైగా ధర చెల్లిస్తున్నారు. దీనివల్ల ఇప్పుడిప్పుడే పరిశ్రమ కోలుకుంటోంది.
- ఈ ధర నిలకడగా ఉంటుందా...? అనేది వేచి చూడాల్సి ఉన్నది. మరోవైపు దాణా ధరలు ఏటా పెరుగుతుండటం కూడా రైతులను కుంగదీస్తున్నది.
- గతేడాది కిలోకు రూ.37 పలికిన దాణా ధర ప్రస్తుతానికి రూ. 43కు పెరగటం వల్ల రైతులకు భారంగా మారుతోంది.

ధరల్లో నిలకడ లేకే ఇబ్బందులు

నేను 25ఏళ్లుగా పౌల్ట్రీ రంగంలోకి ఉన్నాను. నష్టాలు ఎదురైనా తట్టుకున్న. మార్కెట్‌లో చికెన్ ధర పెరుగుతున్నా..ఉత్పత్తి చేసే వాడికి, కొనేవాడికి పెద్దగా లాభం జరగటం లేదు. అమ్మేవాడికి, కొనేవాడికి మధ్యలో ఉన్నవాళ్లకే లాభం జరుగుతున్నది. మేం లైవ్ బర్డ్‌ను ప్రస్తుతం రూ.105కి అమ్ముతున్నాం. అయినా మిగులుతున్నది అంతంతే. నాలుగు నెలలుగా కిలో ధర అతి తక్కువగా కిలోకు కేవలం రూ.55–85మాత్రమే పలికింది. ప్రస్తుతం రూ.105కు పెరిగింది. ఇది ధర కొనసాగుతుందా...లేదా...? అనేది కూడా డౌటే.

పౌల్ట్రీఫామ్ నిర్వాహకుడు, శౌరీపూర్, దౌల్తాబాద్ మండలం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. కమిషనరేట్ పరిధిలో శనివారం పలు సైబర్ నేరాలు జరిగినట్లు ఆమె తెలిపారు.



న్యూడ్ వీడియోలు పంపి...

గౌరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి నుంచి న్యూడ్ వీడియోలు పంపించాడు. అనంతరం ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేశాడు. భయపడిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్ ద్వారా మూడు విడతల్లో రూ.61,450 డబ్బులు పంపించి మోసపోయాడు. ఘటనపై బాధితుడు జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

డేటింగ్ కోసం వెతికి...

చిన్నకోడూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి డేటింగ్ ఇన్ఫర్మేషన్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఆన్‌లైన్ వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో రూ.17,200 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

డేటా ఎంట్రీ జాబ్ పేరిట మోసం

మిరుదొడ్డి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ జాబ్ ఉందని, బ్యాంకు వివరాలు పంపాలని కోరాడు. నమ్మిన బాధితుడు బ్యాంక్ వివరాలతో పాటు తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాడు. దీంతో బాధితుడి ఖాతా నుంచి రూ.9,000 డెబిట్ అయినట్లు గుర్తించి, జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

క్రిప్టో కరెన్సీ అకౌంట్ పేరిట...

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఓ బీడీఎల్ నాలుగులక్షలకు పైగా మోసపోయాడు. భానూర్–బీడీఎల్ ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం.. మండల పరిధిలోని భానూర్– బీడీఎల్ టౌన్‌షిప్‌నకు చెందిన బీడీఎల్ ఉద్యోగి హరిప్రసాద్‌కు ఈనెల 10వ తేదీన వాట్సాప్ ద్వారా ఓ వీడియోస్ లైక్ చేసే జాబ్ ఉందంటూ ఓ లింక్ వచ్చింది. దీంతో బాధితుడు లింక్ క్లిక్ చేసి తన వివరాలు నమోదు చేశాడు. అనంతరం వారు బాధితుడిని టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. వచ్చిన వీడియోస్ లింక్స్ చేయమని చెప్పగా, బాధితుడు క్లిక్ చేయగా అతని ఖాతాలో రూ.4 వేలు జమ చేశారు. అనంతరం బాధితుడికి క్రిప్టో కరెన్సీ అకౌంట్ క్రియేట్ చేసుకోమని చెప్పి లింకు పంపారు. అనంతరం ఆ లింకు ద్వారా బాధితుడు వివరాలు నమోదు చేసి అకౌంట్ క్రియేట్ చేసుకున్నాడు. పెట్టిన నగదుకు 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మించారు. దీంతో అప్పటి నుంచి బాధితుడు పలు దఫాలుగా రూ.4,21,000 జమ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు 30శాతం కమీషన్ ఇవ్వాలని బాధితుడు అడగడంతో వారు స్పందించలేరు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





మద్యం మత్తులో హత్య

- మద్యానికి బానిసైన అన్నాతమ్ముడు
- డబ్బుల విషయంలో తరచు గొడవ
- అడిగితే ఇవ్వలేదని అన్నను చంపిన తమ్ముడు


జగన్ (ఫైల్)


విఠల్

అల్లాదుర్గం(మెదక్): మద్యానికి బానిసై అన్నదమ్ములు తరచు గొడవపడేవారు. డబ్బులు అడిగితే ఇవ్వలేదని, అప్పుడప్పుడు కొడుతుండటంతో అన్నపై కక్ష పెంచుకున్నాడు. నిద్రిస్తున్న సోదరుడి తలపై బండరాయితో కొట్టి హత్య చేసిన దారుణ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర గ్రామంలో శనివారం జరిగింది. సీఐ జార్జ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిల్వెర గ్రామానికి చెందిన నాయకని జగన్ (30), విఠల్, రాజు అన్నదమ్ములు. జగన్, విఠల్ చిల్వెరలో ఒకే ఇంట్లో ఉంటున్నారు. రాజు మాత్రం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కాగా జగన్‌కు భార్య జ్యోతి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మద్యం తాగి తరచు భార్యను కొడుతుండటంతో ఆమె పిల్లలతో కలిసి ఏడాది క్రితం ఖాదీరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జగన్, విఠల్ పూర్తిగా మద్యానికి బానిసయ్యారు. మద్యం తాగి రోజూ గొడవ పడేవారని స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఇద్దరు కలిసి మద్యం తాగి గొడవ పడ్డారు. విఠల్ చెంపపై జగన్ కొట్టాడు. ఈ క్రమంలో జగన్ నిద్రిస్తున్న సమయంలో బండరాయితో తలపై కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం లేచి రక్తపు మరకలున్న రాయిని నీటితో కడిగి, అన్నను చంపేశానని నవ్వుతూ గ్రామస్తులకు విఠల్ చెప్పాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జార్జ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విఠల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి పడి ఉండటంతో స్థానికులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న 35 నుంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ముగ్గురి అదృశ్యం

భర్త ఇంట్లో లేని సమయంలో...


అంకిత (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్‌కుమార్ తన భార్య అంకితతో కలిసి గుమ్మడిదల మండలంలోని బొంతపల్లిలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 16 నుంచి అంకిత అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతోంది. భర్త లేని సమయంలో అంకిత ఇంటినుంచి వెళ్లిపోయింది.దీంతో అరవింద్‌కుమార్ శనివారం ఫిర్యాదు చేయగా,దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ విజయకృష్ణ తెలిపారు.

పనిఉందని బయటకు వెళ్లి...

మండలపరిధిలోని మిట్టపల్లికి చెందిన కేశవుల సంతోష్ వృత్తిరీత్యా డ్రైవర్. ఈ నెల 13వ తేదీన ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శనివారం సిద్దిపేట త్రీటౌన్ పోలీసులకు సంతోష్ భార్య సంతోషి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్నారు.

పనిచేసిన చోట డబ్బు తీసుకురావడానికి వెళ్లి..

జిన్నారం(పటాన్‌చెరు): మధ్యప్రదేశ్‌కు చెందిన జయనారాయణ– మంతిదేవి బొంతపల్లిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈనెల 18న పరిశ్రమలో చేసిన పనికి డబ్బులు తేవడానికి మంతిదేవి ఇంటి నుంచి బయలుదేరింది. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. శనివారం ఆమె భర్త ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయకృష్ణ తెలిపారు.


మంతీదేవి(ఫైల్)

పారిపోయే యత్నం.. పట్టుకున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): చుంచనకోట గుట్టల గంజాయి కేసులో ఇద్దరు అరెస్టయిన విషయం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున ప్రవీణ్ మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చి గోడ దూకి పారిపోయాడు.వెంటనే అప్రమత్తమైన పోలీసులు ప్రవీణ్‌కోసం గాలింపు చేపట్టి గజ్వేల్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీఐ సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా పారిపోయిన ప్రవీణ్‌ను పట్టుకున్నామన్నారు. అరవింద్‌రెడ్డి, ప్రవీణ్‌లను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

కడుపు నొప్పి భరించలేక ఓ మహిళ, తాను ప్రేమించిన అమ్మాయికి ఎంగేజ్‌మెంట్ జరిగిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్రేమించిన అమ్మాయికి ఎంగేజ్‌మెంట్ జరిగిందని..

హత్నూర(సంగారెడ్డి): ప్రేమించిన అమ్మాయికి వేరే అబ్బాయితో ఎంగేజ్‌మెంట్ కావడంతో మనస్తాపానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుండ్లమాచునూర్‌లోని అరబిందో పరిశ్రమలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ముఖేష్(21) కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పరిశ్రమ సమీపంలో రేకుల ఇంట్లో అదే రాష్ట్రానికి చెందిన నలుగురితో కలిసి ఉంటున్నాడు. ముఖేష్ తన స్వగ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ క్రమంలో ఆ అమ్మాయికి కుటుంబపెద్దలు ఎంగేజ్‌మెంట్ చేశారని ఫోన్ ద్వారా తెలుసుకున్న ముఖేష్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. పరిశ్రమ ఎదురుగా ఉన్న ఫైర్‌స్టేషన్ వెనుకలో చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక...

కోహెడరూరల్(హుస్నాబాద్): కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. సంఘటన మండలంలోని గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని రామచంద్రపూర్ గ్రామానికి చెందిన కక్కెర్ల సమతజ్యోతి(41)ఈ నెల 18న కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి భర్త పరుశరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ టెర్రర్...

తాత అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా...

ఒకరు మృతి..మరొకరికి గాయాలు


ప్రశాంత్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తాత అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కమ్మరికత్త గ్రామానికి చెందిన ప్రశాంత్(27) భార్య సౌజన్య, పిల్లలు అక్షర, ఆద్యతో కలసి హైదరాబాద్ మదీనగూడలో ఉంటున్నాడు. టైల్స్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తాత అనుమయ్య మృతిచెందాడు. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వరుసకు సోదరుడు బొల్లారంలో ఉండే అనిల్‌తో కలసి బైక్‌పై స్వగ్రామంకు వెళ్లారు. తిరిగి బైక్ వస్తుండగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ యూటర్న్ వద్ద పాడైన డీసీఎం వాహనాన్ని మరో డీసీఎం తీసుకెళ్తూ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న అనిల్, ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శంకర్

కొల్చారం(నర్సాపూర్): ఎదురుగా వస్తున్న రెండు బైకులు అతివేగంగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కొల్చారం పోలీసుల కథనం పంక్రారం..ఆందోల్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన ముప్పారం శంకర్ భార్య డెలివరీ అయ్యాక తుక్కాపూర్‌లో ఉంది. ఆమెకు చూసి తన బైక్‌పై తిరుగుపయనమయ్యాడు. ఇదే సమయంలో పాపన్నపేట మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన పడమటి గోపాల్ తన మరదలు, తమ్ముడి కూతురుతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. మండల పరిధిలోని రంగంపేట నుంచి తుక్కాపూర్‌కు వెళ్లే రహదారిపై శనివారం రాత్రి శంకర్ అతిగా వేగంగా వచ్చి గోపాల్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శంకర్ తలకు తీవ్ర గాయమైంది. గోపాల్‌కు గాయాలు కాగా, ఆయన మరదలి కాలు విరిగింది. తమ్ముడి కూతురు ప్రమాదం నుండి తప్పించుకుంది. గాయపడ్డ వారిని 108 వాహనంలో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని..

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలపరిధిలోని వావిలాల గ్రామానికి చెందిన నాయికోటి శ్రీనివాస్(44) గురువారం రాత్రి గడ్డపోతారం గ్రామానికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. . గడ్డపోతారం ప్రధాన రహదారిపై రాత్రి పది గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం శ్రీనివాస్ బైక్ ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించటంలో అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ విజయరావు తెలిపారు.


శ్రీనివాస్ (ఫైల్)

మహిళకు తీవ్రగాయాలు

జోగిపేట(అందోల్): మండలపరిధిలోని రాంసానిపల్లిలో బైక్ అదుపు తప్పి మహిళ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గం మండలం మందపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటికుంట తాండాకు చెందిన మహిపాల్ జోగిపేట ఆస్పత్రిలో తన తండ్రిని పరామర్శించడానికి భార్య శాంతిబాయితో కలిసి బైక్‌పై వస్తుండగా రాంసానిపల్లి వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి కింద పడిపోయారు. దీంతో ఆమెకు తలకు వెనక భాగంలో తీవ్రగాయం కాగా, నోరు, ముక్కులో నుంచి రక్తస్రావం అయ్యింది. అక్కడి నుంచే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా 45 నిమిషాల వరకు రాకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత అల్లాదుర్గం ప్రాంతానికి చెందిన అంబులెన్స్ రావడంతో అందులో శాంతిబాయిని ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ స్వరూపరాణి ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ

రెండుచోట్ల హార్వెస్టర్లు దగ్ధం

వరికోత సమయంలో హార్వెస్టర్ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో పూర్తిగా దగ్ధమైంది. మరోచోట విద్యుత్ తీగలు తగిలి ఓ హార్వెస్టర్ కాలిపోయింది.


కొండపాకలో తగలబడుతున్న హార్వెస్టర్

కొండపాక(గజ్వేల్): కొండపాక గ్రామ శివారు బతుకమ్మ చెర్వు సమీపంలో యాపలబాయి నర్సింహారెడ్డి పొలంలో శనివారం రాత్రి హార్వెస్టర్‌తో వరికోత ప్రారంభించారు. ఉదయం నుంచి కోతలు కోయడం, ఎండ ఎక్కువగా ఉండడంతో ఇంజిన్ దగ్గర చిన్నపాటి మంటలు వచ్చాయి. దీంతో డ్రైవరు పరుశురాములు, పక్కనే కూర్చున్న రమేష్‌లు గుడ్డ సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు లేసి డీజిల్ ట్యాంకు పేలింది. అందులో ఉన్న 70 లీటర్ల డీజిల్ హార్వేస్టర్‌పై పడి ఒక్కసారి మంటలు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన ఇద్దరు అక్కడకు నుంచి పరుగులు తీశారు. ఈ సమయంలో అక్కడే ఉన్న మరి కొందరు వ్యవసాయ బావుల వద్ద నుంచి బకెట్లు, బిందెలో నీటిని తెచ్చి మంటలు ఆర్పేశారు. అయినప్పటికీ హార్వెస్టర 90 శాతం పూర్తిగా కాలిపోయింది. తిమ్మారెడ్డిపల్లికి చెందిన భూపాల్‌రెడ్డి లీజుకు తెచ్చి హార్వెస్టర నడిపిస్తున్నాడు. ఈ విషయమై కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా, ప్రాథమిక సమాచారం అందిందని, ఫిర్యాదు రాలేదని చెప్పారు.


దండుపల్లిలో...

దండుపల్లిలో...

మనోహరాబాద్(తూప్రాన్): వరి కోత సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఓ హార్వెస్టర్ దగ్ధమైంది. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన వెంకట్ రెడ్డి వరికోతల కోసం హార్వెస్టర్ లీజుకు తీసుకున్నాడు. శనివారం దండుపల్లి గ్రామానికి చెందిన మరాఠి నరేందర్ పొలంలో వరికోత కోయిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా హార్వెస్టర్‌లో మంటలు చేలరేగాయి. ఇది గమనించి డ్రైవర్ నర్సింలు వెంటనే కిందకు దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. రైతులు నీళ్లు పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా, అప్పటికే హార్వెస్టర్ పూర్తిగా తగలబడిపోయింది.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్ష భస్మార్చన


స్వామి దివ్యమంగళ రూపం

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శనివారం కృత్తిక మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకొని ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు శనగల నాగరాజుశర్మ బృందం లక్ష సుబ్రహ్మణ్యనామాలు పఠిస్తూ మూలవిరాట్‌లకు భస్మార్చన జరిపారు. విశేష అభిషేకం, అలంకరణ అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు దర్శించుకొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చౌడారంలో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం శనివారం శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. రోడ్లు శుభ్రం చేసి, మురికి కాల్వల్లో చెత్తను, పిచ్చిమొక్కలు తొలగించారు. వాటర్ ట్యాంకుల వద్ద శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఇంటి ఎదుట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ములుగు(గజ్వేల్): ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషాతో పాటు మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీవాసులు శనివారం సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఆర్అండ్ఆర్ కాలనీలో నూతనంగా పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని, అదే విధంగా కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతూ ఆయనకు వారు వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న వీఏఏలు

గజ్వేల్‌రూరల్: వీఏఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వీఏఏలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డికి వీఏఏలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వీఏఏలు 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. స్పందించే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నిఖిత, రుక్మిణి, స్వామి, రాజు, నర్సింలు, యాదగిరి, శ్రీనివాస్, రూపలత, భిక్షపతి, రేణుక, వసంత, లక్ష్మి పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలి


శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): నిరుపేదలకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా డబుల్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని బేగంపేటలో ధ్వంసమైన డబుల్ బెడ్రూం ఇళ్ల శిలాఫలకాన్ని శనివారం ఆయన పరిశీలించారు. శంకుస్థాపన చేసి ఐదేళ్లు అయినా ఇళ్లు నిర్మించకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని కూలుస్తారని హెచ్చరించారు. అనంతరం అక్కడే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు నర్సయ్య, వెన్నం రాజు, చింటు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ఐదేళ్లకోసారి ఘనంగా ఎల్లమ్మ జాతర
- 21 నుంచి 24 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- హాజరుకానున్న ప్రముఖులు


ముస్తాబైన రేణుకా ఎల్లమ్మ ఆలయం

దుబ్బాకటౌన్: భక్తులు కోరిన వరాలిచ్చే మహిమగల దేవతగా పేరుగాంచింది దుబ్బాక పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ తల్లి. గౌడకులస్తుల ఆరాధ్య దైవంగా, చుట్టుపక్క గ్రామాల నుంచి వచ్చే భక్తులకు కొంగుబంగారంగా విలసిల్లుతోంది. సాయిబాబ, నాగదేవత ఆలయాలు కొలువైన అమ్మవారి ప్రాంగణంలో జంతుబలి నిషేధం. ఐదేళ్లకోసారి గౌడకులస్తులు తీపి వంటలు, బెల్లం అన్నం బోనంగా చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఎల్లమ్మ సిద్ధయోగం జరుపుతుంటారు. ఈ నెల 21 నుంచి 24వరకు ఉత్సవాలను జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజువారీ కార్యక్రమాలు

21న ఉదయం 9 గంటలకు గోమాత పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గణపతి పూజ, పుణ్యాహావచనం, పంచగవ్య ప్రాశనం, ద్వారపాలక పూజ, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు, చతుష్షష్ఠి, మూలమంత్ర హవనం, గ్రామదేవతలకు బోనాలు, పూజలు ఉంటాయి. 22న స్థాపిత దేవతాపూజ, మూలమంత్ర హవనం, సాయంత్రం బోనాల ఊరేగింపు, రాత్రి లలితా సహస్ర పారాయణం, 23న ఉదయం 5 గంటలకు పుట్టబంగారం తెచ్చుట, అనంతరం ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహిస్తారు. 24న గౌడ కులస్తుల ఇళ్లలో విందు కార్యక్రమాలు ఉంటాయి.

ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారి విగ్రహంతో పాటు ఇతర దేవతల విగ్రహాలను రంగులతో తీర్చిదిద్దారు. భక్తులు పెద్ద ఎత్తున రానుండడంతో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. పట్టణంలో గౌడకులస్తులు ఇళ్లకు సున్నాలు, పచ్చని పందిళ్లు వేసుకున్నారు. పురోహితుడు వేలేటి జయరామ శర్మ, రామకృష్ణశర్మతో వైదిక నిర్వహణ, బైండ్ల రాజరాం, బైండ్ల రామస్వామి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

ఇంటి దైవంగా కొలుస్తాం



రేణుకా ఎల్లమ్మను ఇంటి దైవంగా కొలుస్తాం. అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మహిమగల తల్లి, నమ్ముకున్న వారిని చల్లగా చూసుకుంటూ అష్ట ఐశ్వర్యాలు ప్రసాదిస్తుంది.

– అంబటి బాలేష్‌గౌడ్, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు

భక్తులు సహకరించాలి



ఐదేళ్లకోసారి నిర్వహించే ఎల్లమ్మ ఉత్సవాలకు గౌడసంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయం వద్ద తీపి బోనాల నైవేద్యం, ఎల్లమ్మ సిద్ధయోగం ఘనంగా నిర్వహిస్తాం. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలి.

– పల్లె శ్రీనివాస్‌గౌడ్, గీతపారిశ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి


దుబ్బాకటౌన్: చెత్తను సేకరిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్


హుస్నాబాద్: సెంటర్‌కు పాత పుస్తకాలను అందజేస్తున్న విద్యార్థులు

దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్‌తో కలిసి ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇచ్చిన వాటిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో ప్రజలు ఇచ్చే ప్లాస్టిక్ వస్తువులతో పాటు పుస్తకాలు అన్ని రకాల వస్తువులు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ సంపూర్ణ పారిశుద్ధ్యానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్ఆర్ఆర్‌తో పాత వస్తువులకు చెక్

హుస్నాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రీ యూస్ రీ సైకిల్) సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ప్రారంభించారు. అంతకుముందు పట్టణంలోని 2, 13వ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మన ఇంట్లో చాలా రోజుల నుంచి వాడకుండా, వాడిన వస్తువులను కేంద్రానికి అందించాలన్నారు. పొడి చెత్తకు సంబంధించిన చెప్పులు, షూస్, పాత బట్టలు, నూనె ప్యాకెట్లు, ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు మొదలైన వస్తువులను కేంద్రం ద్వారా తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జూన్ 5వ తేదీవరకు ప్రతి వార్డులో ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇంటి నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. తడి చెత్తతో ఎరువులు తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతులు


సీఎం కప్ విజేతలతో ప్రజాప్రతినిధులు, నాయకులు

వర్గల్(గజ్వేల్): సీఎం కప్ వర్గల్ మండల స్థాయి ఆటల పోటీల్లో విజేతలకు శనివారం ఎంపీపీ సమావేశ మందిరంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలూ యాదవ్, ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

బీరప్ప ఆలయ నిర్మాణానికి కృషి చేయాలి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో బీరప్ప ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, మాజీ సర్పంచ్‌లు బోడపట్ల శివలు శనివారం మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి హరీశ్‌రావు వెంటనే నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని దేవాదాయ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల మల్లయ్య, నాయకులు బోడపట్ల మల్లయ్య, ఎల్లం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజాసమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. దుబ్బాక ఆత్మ గౌరవయాత్ర శనివారం మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాలకు చేరుకుంది. కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ తిరుగుతూ ప్రజా సమస్యలపై ఆయన ఆరా తీశారు. అల్వాలలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో పడుతున్న ఇబ్బందులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాసమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌కు పట్టం కట్టనున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. దాచారంలోని భూ నిర్వాసితులకు శనివారం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కారిడార్ కోసం చేపట్టిన భూసేకరణకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 45 మంది నిర్వాసితులకు 9కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, దాచారం సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ కొలిపాక రాజు, దీటి బాలనర్సు, రాజు, లక్ష్మణ్, తిరుపతి, శేఖర్‌బాబు, శ్రీనివాస్, రాంలింగారెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి

హుస్నాబాద్: ప్రజల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ రూ.20లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టణం రోజురోజుకు విస్తరిస్తుందని, అందుకు తగ్గట్లుగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను కల్పిస్తుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని రాజిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్ కల్పన, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొప్పరి శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ


కమ్మర్లపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలంలో ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను శనివారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. కమ్మర్లపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్, రాజుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా అల్లీపూర్ సర్పంచ్ రాజాబాయ్ సోదరి మృతి చెందడంతో ఆమెను పరామర్శించారు. చెలుకలపల్లిలో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామని మంత్రి భరోసానిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, సర్పంచ్‌లు కాల్వ ఎల్లయ్య, జీవిత బాబు, నాయకులు వేణు, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు


చాదర్‌పల్లి బీటీరోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: చిట్టాపూర్–చాదర్‌పల్లి బీటీరోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలపై క్యూసీ పరీక్ష చేయించాలని పీఆర్ అధికారులను ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశించారు. శనివారం అక్బర్‌పేట–భూంపల్లి మండలం చిట్టాపూర్–చాదర్‌పల్లి మధ్యలో సుమారుగా రూ.1.75 కోట్లతో నిర్మించిన 1.5 కిలోమీటర్ల బీటీరోడ్డును ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన బీటీరోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉండడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నాసిరకంగా రోడ్డు నిర్మించడం ఏమిటని మీరు ఏం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ఈ రోడ్డు నాణ్యత ప్రమాణాలపై వెంటనే సంబంధిత అధికారులతో క్యూసీ పరీక్షలు చేయించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్రం నిబంధనల మేరకే తరుగు

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే మిల్లర్లు ధాన్యం దిగుమతి సమయంలో తరుగు పేరుతో కోతలు పెడుతున్నారని, ఈ విషయాన్ని రైతులు నా దృష్టికి తీసుకొచ్చారని కోతలు లేకుండా అధికారులు, మిల్లర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ మండల పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు సమితి సభ్యులు గ్రామాల్లోని సమస్యలను లేవనెత్తారు. గృహలక్ష్మి పథకం కింద ఊరుకు 50 ఇళ్లు మంజూరు చేయించాలని, రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ మంజూరుకు కృషి చేయాలన్నారు. ఉమ్మాపూర్, నాగారం గ్రామాల మధ్య చేపలు పెంచుకోవడానికి చెరువు పంచాయతీ విషయంపై చర్చించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం దృష్టికి రుణమాఫీ విషయం తీసుకెళ్లి రైతులందరికీ న్యాయం చేస్తానన్నారు. చెరువు, కుంటలకు మరమ్మతులు చేయడంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండి ఎక్కువ పంటల దిగుబడులు వస్తున్నాయన్నారు. ప్రతి గ్రామంలో రూ.50 లక్షల నుంచి రూ.60లక్షల వరకు అభివృద్ధి పనులు చేశామన్నారు. హుస్నాబాద్ పట్టణానికి సమీపంలోని ఏ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేయమన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమవుతుందని త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించి 1.60లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. సిద్దిపేట తరహాలోనే హుస్నాబాద్ అభివృద్ధి చెందుతుందని దానికి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. అందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలబడి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనితిరుపతిరెడ్డి, అక్కన్నపేట జెడ్పీటీసీ భూక్య మంగ, మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం చేస్తే చర్యలు


రాయపోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్డీఓ చంద్రమోహన్‌రెడ్డి

దుబ్బాక: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని డీఆర్డీఓ చంద్రమోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేస్తుందన్నారు. సంబంధిత అధికారులు కొనుగోళ్లలో వేగం పెంచి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోళ్లలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, ఏపీఎం దుర్గప్రసాద్, సీసీలు కిష్టయ్య, ప్రవీణ్ తదితరులున్నారు.

గజ్వేల్‌రూరల్: మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డీఆర్డీఓ చంద్రమోహన్‌రెడ్డి, డీపీఎం వాసుదేవ్‌లు వేర్వేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని జాలిగామలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, బూర్గుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ చంద్రమోహన్‌రెడ్డి, అదేవిధంగా అహ్మదీపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం వాసుదేవ్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానిక అధికారులతో వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తరలింపునకు లారీల సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరితో పాటు స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వరూపారాణి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి తెలిపారు. శనివారం పట్టణ పరిధిలోని 6వ వార్డులో చేపడుతున్న సీసీరోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ యాట కనకవ్వతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజావసరాల రీత్యా వార్డుల వారీగా అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెవిటి లింగం, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు పచ్చిమడ్ల అంజనీదేవి, ముస్త్యాల నాగేశ్వరరావు, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, నాయకులు యాదగిరి, ఎక్బాల్, భిక్షపతి, సిద్దిలింగం, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది, వార్డుప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతు సంక్షేమానికి పెద్దపీట

దుబ్బాక: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్ ఆత్మకమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వారా జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మితో కలిసి రైతులకు జీలుగా విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాబునాయక్, సర్పంచ్ మౌనిక, రైతుబంధు అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

◆ భవన నిర్మాణాలకు భూమిపూజ

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో రజక సంఘం భవన నిర్మాణానికి రూ.18.50లక్షలు, యాదవ సంఘం భవన నిర్మాణానికి రూ.18.50లక్షలు మంజూరు కావడంతో శనివారం సర్పంచ్ అమ్ముల రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌లు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, పీఆర్ఏఈ తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ పీఆర్టీయూ నేతకు పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్‌కు చెందిన పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సోమగారి నాగిరెడ్డి తల్లి లక్ష్మి రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, కార్యదర్శి వెంకటరాజం, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి కనకారెడ్డి పాల్గొన్నారు.

◆ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్)లో ఓ రైతు భూమిలో తాటి చెట్లకు నిప్పుపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల సమితి నాయకుడు మార్క అనిల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఎక్సైజ్ ఎస్ఐ సాయి కృష్ణతో కలిసి కాలిపోయిన తాటి చెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులకు జీవనాధారమైన తాటి చెట్లను కాల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ సాయి కృష్ణ తెలిపారు. ఆయనతో సర్పంచ్ బత్తిని సాయిలు ఉన్నారు.

◆ నియామకం

దుబ్బాక: దౌల్తాబాద్ మండల ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన తలారి మహేశ్‌ను నియమిస్తున్నట్లు ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి తెలిపారు. ఈ మేరకు ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్ ఆదేశాల మేరకు శనివారం తలారి మహేశ్‌కు ఆయన నియామకపత్రం అందజేశారు.

◆ 23న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం

సిద్దిపేటకమాన్: ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సమావేశానికి సిద్దిపేట జిల్లా నుంచి అధిక సంఖ్యలో నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, నాయకులు ఎల్లం, కనకయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆత్మీయ సమ్మేళన కమిటీ ఏర్పాటు

దుబ్బాకరూరల్: నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆస యాదగిరి, కమిటీ సభ్యులుగా గుర్రాల శ్రీనివాస్, ర్యాకం శ్రీరాములు, వనం రమేశ్, కరికె శ్రీనివాస్, అక్బర్‌పేట–భూంపల్లి సభ అధ్యక్షుడిగా జీడిపల్లి రవిలను ఎన్నుకున్నారు. ఈనెల 30న అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎంపీ ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు.

◆ ఉత్సవాలకు ఆహ్వానం

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరులో నిర్వహించే రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు రావాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రఘునందన్‌రావులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, పాండు, మధు, ప్రవీణ్, పవన్‌గౌడ్ ఉన్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తొగుట(దుబ్బాక): బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కల్లెపు సుధాకర్ శనివారం సిద్దిపేటకు వచ్చి సాయంత్రం బైక్‌పై తిరిగి వెంకట్రావుపేటకు వెళ్తుండగా సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లి వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయపడిన సుధాకర్‌ను స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.